క్లుప్తంగా

చిత్ర పటాలకు క్షీరాభిషేకం



క్షీరాభిషేకం నిర్వహిస్తున్న నాయకులు

మునిపల్లి(అందోల్): అన్ని కులాలకు కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చిత్ర పటాలకు మాజీ ఎంపీపీ రాంరెడ్డి ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. మండలంలోని మునిపల్లి, ఖమ్మంపల్లి చౌరస్తా అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో గోపులారం ఎంపీటీసీ పాండు, పెద్దచల్మెడ ఎంపీటీసీ రాధాబాయి జోషి, మునిపల్లి మాజీ ఎంపీటీసీ మంతూర్ సుధాకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సతీశ్ కుమార్, నర్సింహగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా విశ్వనాథ్



నూతన కార్యవర్గం

జహీరాబాద్ టౌన్: బీజేపీ జహీరాబాద్ పట్టణ నూతన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షురాలు గోదావరి నియమించారు. పట్టణ అధ్యక్షుడిగా మఠం విశ్వనాథ్, ఉపాధ్యక్షులుగా అప్పం శ్రవణ్ కుమార్, కృష్ణకాంత్, నీలేశ్, అర్చన సరడా, ప్రధాన కార్యదర్శులుగా పాలికర్ సంతోష్, బొగ్గుల సంతోష్, కార్యదర్శులుగా శివపూజ శ్రీకాంత్, దుర్గేశ్, ఈప్తి చంద్రశేఖర్, సుభాస్ మున్నూర్, కోశాధికారిగా ఎం.చంద్రశేఖర్, అధికార ప్రతినిధిగా వీరేశ్ మఠపతిలు నియమితులయ్యారు.

శివాలయ నిర్మాణానికి రూ.2.50లక్షలు



విరాళాన్ని అందజేస్తున్న రవీందర్

జిన్నారం(పటాన్‌చెరు): నూతనంగా నిర్మిస్తున్న జ్యోతిర్లింగ శివాలయ నిర్మాణానికి హత్నూర మండలంలోని ఎల్లమ్మగూడ గ్రామానికి చెందిన రవీందర్ దంపతులు గురువారం రూ. 2.50 లక్షలు విరాళంగా అందించారు. నిర్వాహకులు రవీందర్ దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. దేవాలయ నిర్మాణంలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజాసేవలోనే సంతృప్తి

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నేత నీలం మధు



స్కూటీలను అందజేస్తున్న మధు

పటాన్‌చెరు టౌన్: నిరంతరం ప్రజలకు సేవ చేయడంలోనే తృప్తి, ఆనందం ఉందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నీలం మధు అన్నారు. మండలం చిట్కుల్ గ్రామంలో గురువారం ఆయన జన్మదినం సందర్భంగా ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి యువత, వివిధ పార్టీల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. సేవా కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు నిర్వహించారు. రామచంద్రాపురం, కర్దనూర్ గ్రామానికి చెందిన ఇద్దరు దివ్యాంగులకు ఎన్ఎంఆర్ యువసేన తరఫున ఎలక్ట్రికల్ స్కూటీలను మధు చేతుల మీదుగా అందజేశారు.

పెన్నులు, ప్యాడ్ల పంపిణీ



పూలకుండీలు అందజేస్తున్న వసంత్‌రాజ్

కోహీర్(జహీరాబాద్): మండల పరిధిలోని దిగ్వాల్ ప్రభుత్వోన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు డాక్టర్ వసంత్‌రాజ్ 130 మంది విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్లు పంపిణీ చేశారు. 41మంది ఇంగ్లిష్ మీడియం విద్యార్థులతో పాఠశాలకు పూలకుండీలు, పూలమొక్కలను ప్రధానోపాధ్యాయుడు జాకీర్‌హుసేన్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేశ్, సురేశ్, శ్రీనివాస్, రియాజ్, విజయలక్ష్మి, భార్గవి, బద్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

8 టిప్పర్ల పట్టివేత

న్యాల్‌కల్(జహీరాబాద్): నిబంధనలను ఉల్లంఘించిన 8 టిప్పర్లను టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. మిర్జాపూర్(ఎన్) వైపు నుంచి జహీరాబాద్ వైపు ఓవర్‌లోడ్‌తో వెళుతున్న ఆ వాహనాలను ముంగి చౌరస్తా వద్ద పట్టుకుని, హద్నూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు అధికారులు తెలిపారు.

నిరుపయోగంగా ఆర్టీసీ ప్రాంగణాలు



కోహిర్‌లో నిరుపయోగంగా మారిన ఆర్టీసీ బస్టాండ్

ఇబ్బందుల్లో ప్రయాణికులు

జహీరాబాద్: నిర్వహణ లోపంతో ఆర్టీసీ బస్టాండ్లు ప్రయాణికులకు ఉపయోగపడకుండా పోతున్నాయి. దీంతో అవి అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. జహీరాబాద్ నియోజక వర్గంలోని మండల కేంద్రాలైన న్యాల్‌కల్, కోహీర్, ఝరాసంఘం ప్రాంతాలలో 3 దశాబ్దాల క్రితం ప్రభుత్వం ఆర్టీసీ ప్రాంగణాలను నిర్మించింది. దశాబ్దం పాటు సక్రమంగా నిర్వహించడంతో కొంతమేర ప్రయాణికులు వినియోగించుకున్నారు. క్రమంగా నిర్వహణలోపంతో 2 దశాబ్దాలుగా వినియోగించుకోక పోవడంతో అధ్వానంగా మారాయి. రానురానూ శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో ప్రయాణికులు బస్టాండ్ల వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. ఇక వర్షాకాలం, వేసవి కాలంలో బస్సుల కోసం రోడ్లపై వేచి చూడాల్సిన పరిస్థితి. లేదంటే పక్కనే ఉన్న వ్యాపార సంస్థల వద్ద నిలబడాల్సి వస్తోందని వాపోతున్నారు. అనువుగా లేని ప్రాంతాల్లో బస్టాండ్లను నిర్మించడం కూడా నిరుపయోగానికి కారణమనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఇప్పటికీ పాత బస్టాండ్ల వద్దనే వేచి చూస్తున్నారు. ప్రస్తుతం న్యాల్‌కల్, కోహీర్, ఝరాసంఘం పట్టణాలుగా విస్తరించాయి. దీంతో ఇక్కడ బస్టాండ్లలో మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకొస్తే ప్రయాణికులు ఉపయోగించుకునే అవకాశం ఉంది. ప్రభుత్వం కూడా నిధులను కేటాయించాలని కోరుతున్నారు. నిరుపయోగంగా మారిన బస్టాండ్లు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయి. పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో వాహనాల పార్కింగ్ కోసం, మందుబాబులకు కేంద్రంగా మారాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతు చేయించి వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.

> **ఉపయోగంలోకి తేవాలి**
>
> 
>
> న్యాల్‌కల్లోని బస్టాండ్ అధ్వానంగా మారింది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మూత్ర శాలలు కూడా నిరుపయోగంగా మారాయి. దీంతో మహిళా ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలి. – వీరన్న, గుంజోటి గ్రామం

నిత్యం వెయ్యి మందికిపైగా...

కోహీర్, న్యాల్‌కల్, ఝరాసంఘం బస్టాండ్ల నుంచి నిత్యం వేయి మందికి పైగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. 35 ట్రిప్పుల వరకు బస్సులు నడుస్తున్నాయి. ఇందులో సగం ట్రిప్పులు విద్యార్థుల కోసమేనని తెలుస్తోంది. కోహీర్ బస్టాండ్ నుంచి నిత్యం 400 మంది వరకు ప్రయాణిస్తుంటారు. హైదరాబాద్, తాండూర్, తొరమామిడి, మనియార్ పల్లి, బిలాల్ పూర్, పైడిగుమ్మల్ ప్రాంతాలకు 16 ట్రిప్పులు బస్సులు నడుపుతున్నారు. న్యాల్‌కల్ నుంచి నిజామాబాద్, నారాయణ్ ఖేడ్, బీదర్ ప్రాంతాలకు 15 ట్రిప్పులు నడుస్తుండగా 500మందికి పైగా ప్రయాణిస్తుంటారు. ఝరాసంఘం నుంచి మెదక్, నిజామాబాద్, పీపడ్‌పల్లి, జహీరాబాద్ ప్రాంతాలకు 14ట్రిప్పులు నడుస్తున్నాయి. 400 మంది వరకు ప్రయాణం చేస్తున్నారు.

క్రీడాస్ఫూర్తి ముఖ్యం

- ద్రోణాచార్య అవార్డు గ్రహీత రమేశ్



మాట్లాడుతున్న రమేశ్

పటాన్‌చెరు టౌన్: ఆటలలో గెలుపు, ఓటమిలను సమానంగా స్వీకరించాలని ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేశ్ పిలుపునిచ్చారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో 'గస్టో-2024' పేరిట నిర్వహిస్తున్న అంతర్ విశ్వవిద్యాలయ క్రీడా పోటీలను గురువారం ఆయన క్రీడా జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఐక్యత, క్రీడాస్ఫూర్తి పెంపొందించడంలో క్రీడలకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. జట్టులో సమర్థవంతంగా ఎలా పనిచేయాలో నేర్చుకుంటారని చెప్పారు. ఈ టోర్నమెంట్లో క్రికెట్, వాలీబాల్, టేబుల్ టెన్నిస్, ఫుట్‌బాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, త్రోబాల్, చెస్, బాస్కెట్ బాల్ వంటి వివిధ రకాల క్రీడా పోటీలను నిర్వహిస్తున్నారు. 26 కళాశాలలు, విశ్వవిద్యాలయాలకు చెందిన జట్లు పాల్గొంటున్నాయి. కార్యక్రమంలో రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం.నారాయణరావు చౌదరి, స్పోర్ట్స్‌మేనేజర్ తపస్వి తదితరులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం బహిష్కరణ

ఎఈపీఆర్ మధుకర్ తీరుపై అసహనం
జిల్లా అధికారులకు ఫిర్యాదు

మునిపల్లి(అందోల్): మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ బహిష్కరించారు. గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించేందుకు ఎంపీడీఓ హరినందన్‌రావు ఏర్పాట్లు చేశారు. సభ ప్రారంభం కాగానే ఎఈపీఆర్ సమావేశానికి ఎందుకు రాలేదని ఎంపీడీఓను అడిగారు. తనకు సమాచారం లేదని ఎంపీడీఓ ప్రజా ప్రతినిధులకు తెలిపారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ఉపాధి హామీ పథకంలో నిర్వహిస్తున్న సీసీ రోడ్ల వంటి సమాచారాన్ని స్థానిక ప్రజా ప్రతినిధులతో పాటు ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలకు ముందుగా తెలియజేయడం లేదని ప్రజా ప్రతినిధులు మండిపడ్డారు. అంతే కాకుండా ప్రొటోకాల్ పాటించడం లేదని ఏఈపీఆర్ మధుకర్ తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఏఈపీఆర్ మధుకర్ సర్వసభ్య సమావేశానికి వస్తే కాని మండల సర్వసభ్య సమావేశం నిర్వహించేది లేదని, తాము బహిష్కరిస్తున్నట్లు ప్రజా ప్రతినిధులు ప్రకటించి వెళ్లిపోయారు. కార్యక్రమంలో ఎంపీపీ శైలజ, జెడ్పీటీసీ మీనాక్షి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు

ఇరిగేషన్ ఏఈ

హత్నూర(సంగారెడ్డి): చెరువు శిఖం బఫరింగ్ జోన్ కబ్జాచేసే విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని నీటిపారుదల శాఖ ఏఈ భూమిపుత్ర గురువారం ఆవేదన వ్యక్తం చేశారు. హత్నూర మండలం మల్కాపూర్ గ్రామ శివారులోని అయ్యమ్మ చెరువును కొందరు ఆక్రమణలకు పాల్పడినట్లు గుర్తించి అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేశానన్నారు. మార్చి 2న హత్నూర పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశానని, కాని పోలీసులు ఏవిధమైన చర్యలు తీసుకోకపోవడం దారుణమని వాపోయారు. ప్రభుత్వాధికారుల ఫిర్యాదులనే పట్టించుకోని పోలీసుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై పోలీసులను వివరణ కోరగా ఫిర్యాదు చేసిన విషయం నిజమేనని తెలిపారు.

ఘనంగా 'స్వయం పాలన'



జిన్నారం(పటాన్‌చెరు): విద్యార్థులతో ఉపాధ్యాయులు



నారాయణఖేడ్‌లో..

ప్రాథమికోన్నత పాఠశాలల్లో గురువారం స్వయంపాలన దినోత్సవాన్ని విద్యార్థులు ఉత్సాహంగా నిర్వహించారు. ఉపాధ్యాయులుగా మారి తోటి వారికి పాఠాలు బోధించారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

నారాయణఖేడ్: మండలంలోని చాప్టా (కె)లో రూ.10 లక్షలతో మంజూరు చేసిన సీసీరోడ్డు పనులను గురువారం పంచాయతీ కార్యదర్శి రాములు, మాజీ సర్పంచ్ గంగయ్యస్వామి, మాజీ ఉపసర్పంచ్ నారాయణరెడ్డి గ్రామపెద్దలతో కలిసి ప్రారంభించారు. రోడ్డుకు నిధులు మంజూరు చేయడంపై గ్రామస్తులు గోవింద్ రెడ్డి, నాగయ్య స్వామి, శివారెడ్డి, నందు, దావీద్, జైవంత్, విఠల్, తుకారాం, బసప్ప తదితరులు సంతోషం వ్యక్తం చేశారు.

విద్యార్థిని అదృశ్యం



నాగరాణి(ఫైల్)

మునిపల్లి(అందోల్): మండలంలోని చీలపల్లి గ్రామానికి చెందిన పిల్లోడి నాగరాణి 12న అదృశ్యమైనట్టు బుదేరా ఎస్ఐ సురేశ్ గురువారం తెలిపారు. బ్యాంకుకు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లి తిరిగి రాకపోవడంతో తండ్రి మాణయ్య ఫిర్యాదు చేసినట్లు ఆయన చెప్పారు. నాగరాణి అమీన్‌పూర్‌లో శ్రీచైతన్య డిగ్రీ కాలేజీలో చదువుతోందని, రెండు రోజుల క్రితం స్వగ్రామమైన చీలపల్లికి వచ్చినట్లు ఎస్ఐ తెలిపారు.

ఊబర్ రైడ్‌కు వెళ్లి..

పటాన్‌చెరు టౌన్: ఊబర్ రైడ్‌కు వెళ్తున్నానని చెప్పి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన అమీన్‌పూర్ పరిధిలో చోటుచేసుకుంది. ఓడీఎఫ్ కాలనీకి చెందిన శ్రీనివాస్‌రెడ్డి బుధవారం సాయంత్రం ఊబర్ రైడ్‌కు వెళ్తున్నా నని చెప్పి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. భార్య మాలతి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. గురువారం ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ..

కంది(సంగారెడ్డి): గుర్తు తెలియని వాహనం ఢీకొని చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మృతి చెందాడు. కందికి చెందిన శంషుద్దీన్(41), నజీర్ అనే ఇద్దరు స్నేహితులు బుధవారం మామిడిపల్లికి వెళ్లారు. తిరిగి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన శంషుద్దీన్‌ను హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

బ్రిడ్జి వద్ద కుంగిన రహదారి

- అదుపుతప్పుతున్న వాహనదారులు
- మరమ్మతులు చేయాలని డిమాండ్



బ్రిడ్జి వద్ద ప్రమాదకరంగా ఉన్న రోడ్డు

ఝరాసంగం(జహీరాబాద్): అధికారుల నిర్లక్ష్యం, నిర్వహణ లోపంతో రహదారులపై వాహనదారులు, ప్రయాణీకులకు ఇబ్బందులు తప్పడం లేదు. మండల పరిధిలోని కప్పాడ్ గ్రామం నుంచి ఝరాసంగం మీదుగా జహీరాబాద్‌కు నిత్యం వందల సంఖ్యలో వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. మండల పరిధిలోని సంగం(కె) గ్రామ శివారులో ఉన్న బ్రిడ్జి వద్ద రోడ్డు కుంగిపోవడంతో బ్రిడ్జి ఎత్తుగా మారి స్పీడ్ బ్రేకర్‌ను తలపిస్తుంది. వాహనదారులకు దగ్గరకు వచ్చే వరకు అది కానరాదు. దీంతో ఒక్కసారిగా వాహనదారులు కుదుపుకులోనై ఇబ్బందులు పడుతున్నారు. పలువురు ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి కింద పడిపోయి గాయాల పాలైన సందర్భాలు చాలా ఉన్నాయి. ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేదని వాహనదారులు వాపోతున్నారు. రోడ్డుకు మరమ్మతులు చేయించాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

ఆటో డ్రైవర్లకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న చింతా ప్రభాకర్

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి: ఆటో డ్రైవర్లకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ డిమాండ్ చేశారు. గురువారం క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు పథకం వల్ల ఆటోడ్రైవర్ ఉపాధి కోల్పోయి భార్యకు ఉరివేసి తాను ఆత్మహత్య చేసుకున్న ఘటన కలచివేసిందన్నారు. వెంటనే ఆత్మహత్య చేసుకున్న డ్రైవర్ల కుటుంబాలకు ప్రభు త్వం రూ.10లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నెలకు రూ.10వేల భృతి ఇచ్చి ఆదుకోవాలన్నారు. మరో రెండు రోజుల్లో మిగిలిన హామీలు అమలు చేయకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు.

పదోన్నతులు కల్పించాలని డిమాండ్



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న సాయిలు

జహీరాబాద్ టౌన్: రెసిడెన్షియల్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు కోరారు. మండలంలోని రంజోల్, అల్గోల్, బూచినెల్లిలోని గురుకుల పాఠశాలలను గురువారం సందర్శించి ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెసిడెన్షియల్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలపై షెడ్యూల్ ప్రకటించాలని, హెల్త్‌కార్డులు జారీచేసి ఉచితంగా వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. పీఆర్‌సీలో అదనపు ఇంక్రిమెంట్ ఇవ్వాలని, పని ఒత్తిడి తగ్గించాలని కోరారు. జీఓ నంబర్ 317 ప్రకారం స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులకు సొంత జిల్లాలకు పంపించి న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వం చొరవతీసుకొని గురుకుల ఉపాధ్యాయుల డిమాండ్‌లను పరిష్కరించాలన్నారు. జిల్లా కార్యదర్శి శ్యామయ్య, మండల ప్రధాన కార్యదర్శి విఠల్, నాయకులు శ్యాంసుందర్, వెంకటరావు పాల్గొన్నారు.

ప్రశ్నించేతత్వం అవసరం : విజయ్ కుమార్



అతిథులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్

పటాన్‌చెరు: ప్రశ్నించేతత్వం అలవర్చుకున్నప్పుడే సంపూర్ణ వినియోగదారులవుతామని జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ సభ్యుడు విజయ్ కుమార్ అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కన్స్యూమర్ క్లబ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బాధ్యతలను నిర్వర్తించేవారే హక్కులను పొందగలుగుతారని వివరించారు. అనంతరం మోసపూరిత వ్యాపార ప్రకటనలు, అంతర్జాలంలో ఉండే బెట్టింగ్ యాప్‌లపై ప్రముఖ న్యాయవాది డాక్టర్ కూన వేణు అవగాహన కల్పించారు. అనంతరం వంశీ ప్రియ రెడ్డి, ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, వీరేందర్ మాట్లాడుతూ పలు విషయాలను వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ అల్లం రెడ్డి, రాజిరెడ్డి పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత



ధ్యాన మందిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: మానసిక ప్రశాంతత కోసం ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావం పెంపొందించుకోవాలనే లక్ష్యంతో రూ.50లక్షల సొంత నిధులతో ధ్యాన మందిరాన్ని నిర్మించామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని రుద్రారం సిద్ధిగణపతి ఆలయంలో నూతనంగా నిర్మించిన ధ్యాన మందిరాన్ని గురువారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆలయాల అభివృద్ధికి సహకారం అందిస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని దేవాలయాలు, మసీదులు, చర్చిలు నిర్మించి ప్రతి ఒక్కరిలో పరమత సహనాన్ని పెంపొందించామని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పాండు, మాజీ సర్పంచ్ సుధీర్‌రెడ్డి, సీనియర్ నాయకులు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **మహిళలకు సన్మానం**

హత్నూర (సంగారెడ్డి): మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా సంఘాల సభ్యులకు గురువారం సన్మానం చేశామని సీసీ మహేశ్ తెలిపారు. గ్రామ సంఘంలోని అంతర్గత సంఘాల అధ్యక్షులు, వివిధ కార్యక్రమాలలో ప్రతిభ కనబరిచిన ఎస్ హెచ్ జీ లీడర్లను సత్కరించామని చెప్పారు. కార్యక్రమంలో వీఓఏ లక్ష్మయ్య, జ్యోతి అశ్విని, గ్రామ సంఘం లీడర్లు అపర్ణ, సంధ్య తదితరులు ఉన్నారు.

◆ **ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం**

సదాశివపేట(సంగారెడ్డి): కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది కృష్ణ పేర్కొన్నారు. గురువారం ఆయన ఆధ్వర్యంలో ఆర్యవైశ్యులు బస్టాండ్ వద్ద టపాసులు కాల్చి స్వీట్లు తినిపించుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, కాంగ్రెస్ అధ్యక్షురాలు నిర్మలారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాశెట్టి ప్రకాశం, సాయిరాజ్, కొమ్మ రమేశ్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

◆ **గృహజ్యోతి లబ్ధిదారుల ఆందోళన**

కోహీర్(జహీరాబాద్): జీరో బిల్లులు రావడం లేదని గృహజ్యోతి లబ్ధిదారులు ఆందోళనకు దిగారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. దరఖాస్తులు ఇచ్చినప్పటికీ తమకు జీరో బిల్లులు రావడంలేదని వాపోయారు. అధికారులు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఎంపీఓ రఘు స్పందించి కంప్యూటర్‌లో పొందుపరచాలని ఆపరేటర్లకు సూచించారు.

◆ **కూలీల సంఖ్య పెంచాలి**

రాయికోడ్(అందోల్): ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీఓ మసూద్‌షరీఫ్ ఈజీఎస్ సిబ్బందిని ఆదేశించారు. రాయికోడ్‌లోని ఎంపీపీ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్‌లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో కనీసం వంద మంది కూలీలు పనిచేసేలా చూడాలన్నారు. సమావేశంలో ఏపీఓ రమేశ్‌కుమార్, ఈసీ విష్ణువర్ధన్, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

◆ **నేడు న్యూరో, డయాబెటిక్ శిబిరం**

సంగారెడ్డి: రైతు బజార్ ఎదురుగా ఉన్న సాహితీ హాస్పిటల్‌లో శుక్రవారం ఉచిత న్యూరో, డయాబెటిక్ క్యాంపు నిర్వహించనున్నట్లు ఆస్పత్రి అధినేత సాహితీ రాము గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5 వరకు శిబిరం ఉంటుందని, అన్నిరకాల సమస్యలకు పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

◆ **స్టే ఎత్తివేతతో వేడెక్కిన రాజకీయాలు**

జిన్నారం(పటాన్‌చెరు): ఎంపీపీ ఎన్నికపై ఇటీవల కోర్టుస్టే ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే బీఆర్ఎస్ నేతలు కోర్టును ఆశ్రయించడంతో కోర్టు స్టే ఎత్తివేసింది. దీంతో మరోసారి మండల రాజకీయాలు వేడెక్కాయి. బీఆర్ఎస్‌కు చెందిన ఎంపీటీసీ సభ్యులు కాంగ్రెస్‌కు చెందిన ఎంపీపీపై అవిశ్వాసం ప్రకటించారు. దీంతో గత నెలలో అవిశ్వాసంపై సభను ఏర్పాటు చేయాల్సి ఉండగా ఎంపీపీ రవీందర్‌గౌడ్ కోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నారు. ఎంపీపీకి కోర్టు స్టే ఇవ్వడంపై బీఆర్ఎస్ ఎంపీటీసీలు కూడా కోర్టును ఆశ్రయించారు. ప్రస్తుతం కోర్టు స్టేను ఎత్తివేసింది. 2న అవిశ్వాసంపై సమావేశం నిర్వహించాలని అధికారులు చెప్పారు.

◆ **రేపు మండల సర్వసభ్య సమావేశం**

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల సర్వసభ్య సమావేశం 16న నిర్వహించనున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీఓ సురేశ్ తెలిపారు. ఉదయం 11గంటలకు ఎంపీపీ సమావేశ మందిరంలో ఎంపీపీ అధ్యక్షురాలు అంజమ్మ అధ్యక్షతన నిర్వహించే సర్వసభ్య సమావేశానికి నేతలు, అధికారులు, వివిధ శాఖల సిబ్బంది హాజరు కావాలని ఆయన కోరారు.

◆ **ఘనంగా జాతర ప్రారంభం**

కోహీర్(జహీరాబాద్): రాచన్న స్వామి వార్షిక ఉత్సవాలు గురువారం ఉదయం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్వామికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. అడవిలో స్వామి వారు తపస్సు చేసిన అయ్యగవి వద్దకు భాజాభజంత్రీలతో వెళ్లి పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యనిర్వాహణ అధికారి శివరుద్రప్ప, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు దయానంద్‌స్వామి, శ్రీపాల్, సరస్వతి, అశోక్, నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

◆ **తాండూర్‌కు పాదయాత్ర**

జహీరాబాద్ టౌన్: మండలంలోని ధనసిరి పీఠాధిపతి వీరేశ్వర శివాచార్యుల ఆధ్వర్యంలో లోక కల్యాణార్థం చేపట్టిన శ్రీశైలక్షేత్రం మహా పాదయాత్ర రెండో రోజు గురువారం తాండూర్‌కు చేరుకుంది. సుమారు 1200మంది భక్తులు పాదయాత్రలో పాల్గొన్నారు. పది రోజులపాటు 380కిలో మీటర్ల వరకు పాదయాత్ర కొనసాగుతుంది. పాదయాత్రలో మాజీ సర్పంచ్ హబ్సిరాజు, ఎన్ఆర్ఐ రవి, జగన్నాథ్, ఎంపీటీసీ బాబు, మల్లికార్జున్‌రెడ్డి, హబ్సి అశోక్ తదితరులు ఉన్నారు.

◆ **అంబేడ్కర్ జయంతికి చర్యలేవి**

నారాయణఖేడ్: ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతిని గ్రామగ్రామాన ప్రభుత్వమే నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని వివిధ దళితసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఖేడ్‌లో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు సంతోష్, అంబేడ్కర్ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు కాన్షీరాం, ఆయా సంఘాల నాయకులు సమావేశమయ్యారు. అన్ని విద్యాసంస్థల్లో రాజ్యాంగ పీఠికను ప్రతిజ్ఞ చేసే విధంగా ఉత్తర్వులివ్వాలని డిమాండ్ చేశారు.

◆ **ప్లాస్టిక్ కవర్లు వాడొద్దంటూ నోటీసులు**

నారాయణఖేడ్: మున్సిపాలిటీ పరిధిలోని వివిధ దుకాణాలు, వ్యాపార, వాణిజ్య సంస్థలు ప్లాస్టిక్ కవర్లను వాడొద్దంటూ శానిటరీ అధికారి శ్రీనివాస్ నోటీసులు అందజేశారు. లేనిపక్షంలో తనిఖీలు నిర్వహించి జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

◆ **ముగిసిన సదస్సు**

సంగారెడ్డి అర్బన్: తారా ప్రభుత్వ కళాశాల నిర్వహించిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.వెంకటేశం తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులకు రీజనింగ్, అర్థమెటిక్ వంటి అంశాలలో శిక్షణ ఇచ్చారన్నారు. వైస్ ప్రిన్సిపాల్ ఎం.ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

జ్ఞాన మందిర నిర్మాణానికి విరాళం

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని బీసీ కాలనీలో మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జ్ఞానమందిర నిర్మాణానికి మాజీ జెడ్పీటీసీ సభ్యుడు గడీల శ్రీకాంత్‌గౌడ్ గురువారం రూ.45వేల విరాళాన్ని అందించారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. చంద్రారెడ్డి -9912220353
కె. సంగారెడ్డి -9010294400